క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ

కంబదూరు: మండలంలోని నూతిమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 8న అనంతపురంలో జరిగిన అండర్–14 బాలురు, బాలికల విభాగంలో జరిగిన సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీల్లో వసంత, జగన్, ఆశాబేగం, మమత, రాజేష్, లక్ష్మిదేవి, హరిత ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్‌రెడ్డి, పీడీ చిట్రా ఓబుళేసు, సంజీవరాయుడు గురువారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులు త్వరలో గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

విప్‌ను కలసిన ఆర్డీఓ



ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్డీఓ రాణి సుష్మిత

రాయదుర్గం: కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణి సుష్మిత గురువారం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్డీఓగా విధుల్లో చేరిన తర్వాత తొలిసారిగా విప్ కాపుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. విప్ కాపు, సతీమణి కాపు భారతి ఆర్డీఓను సన్మానించారు. అనంతరం రాయదుర్గం ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యల పై చర్చించారు. అలాగే జర్నలిస్టులకు మూడు సెంట్ల స్థలం ఇవ్వాలని రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడంతో భూసేకరణ చేపట్టి వారందరికీ న్యాయం చేయాలని విప్ కాపు కోరారు. ఇందుకు ఆర్డీఓ సానుకూలత వ్యక్తం చేశారు. ఆర్డీఓ వెంట స్థానిక రెవెన్యూ అధికారులున్నారు.

రాజీ మార్గమే రాజమార్గం

కళ్యాణదుర్గం రూరల్: రాజీ మార్గమే రాజమార్గమని జడ్జి సుభాన్ అన్నారు. గురువారం పట్టణంలోని కోర్టులో జాతీయ న్యాయ సేవా దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి సుభాన్, పట్టణ సీఐ హరినాథ్. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. జడ్జి మాట్లాడుతూ చిన్న తగాదాలతో కేసులు నమోదు చేసుకోకుండా రాజీపడి ప్రశాంత జీవితం గడపాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవేంద్ర, గౌరవాధ్యక్షుడు కరణం తిప్పేస్వామి, కార్యదర్శి బంగి రవికుమార్, న్యాయవాదులు, దాదాఖలాధర్, హరి, చక్రవర్తి, ఎర్రిస్వామి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోండి



సత్యసాయి రిజర్వాయర్ వివరాలు తెలుసుకుంటున్న ఎంపీ రంగయ్య

వజ్రకరూరు: తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని కొనకొండ్ల గ్రామ సమీపంలో ఉన్న సత్యసాయి రిజర్వాయర్‌ను ఎంపీ పరిశీలించారు. కాలనీలకు ఎందుకు నీరు సరఫరా కావడం లేదో వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మోటారు ఏర్పాటు చేయించి నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నారు. రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని అధికారులను ఆదేశించారు. తాగునీ టి అవసరాలకు ఎంపీ నిధుల నుంచి రూ.6లక్షలు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆర్‌డబ్ల్యూస్ డీఈ అఫ్రిన్, జేఈ దాక్షాయణి, గ్రామ కార్యదర్శి మురళి, ఇంజినీర్ బాలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకాదశి పూజలు



అలంకరణలో రుక్మిణీ పాండురంగస్వామి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామికి ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున ప్రత్యేక జలంతో స్వామికి వేదమంత్రోచ్ఛారణల మధ్య అభిషేకం చేసి స్వామి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ మహామంగళహారతి నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున తులసి మాలధారణకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు.

జగన్‌కు మద్దతుగా నిలవండి

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి
- వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి భారీ స్పందన

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయా మండలాల్లో ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని వారు కోరారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌తోనే సాధ్యమన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



రాయదుర్గం మండలం ఆవులదట్లలో ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించే బోర్డును ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



వజ్రకరూరు మండలం చాబాల సచివాలయంలో బుక్‌లెట్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

రాయదుర్గం/రాయదుర్గం రూరల్: నాలుగున్నరేళ్ల పాలనలో ప్రతి ఇంటికీ, ప్రతి పౌరుడికీ ప్రత్యక్షంగా, పరోక్షంగా మేలు చేకూర్చి వారి జీవన విధానంలో మార్పులు తీసుకొచ్చేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కృషి చేశారని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. నవరత్న పథకాల అమలుతో పేదరికం లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దారని కొనియాడారు. పట్టణంలోని 1, 2వ వార్డు సచివాలయం పరిధిలోని పార్వతినగర్ వద్ద 'వై ఏపీ నీడ్స్ జగన్' అనే కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, స్థానిక కౌన్సిలర్ భీమనపల్లి నాగవేణి, కమిషనర్ దివాకర్‌రెడ్డి, పట్టణ, సచివాలయాల కన్వీనర్లు అరవ శివప్ప, సిద్దేశ్వర(బుజ్జి) లతో కలసి విప్ గురువారం ప్రారంభించారు. సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ చేపట్టారు. అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో విప్ కాపు మాట్లాడారు.. మంచిచేసే ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతుగా నిలవాలన్నారు. గతంలో చంద్రబాబు సర్కారుకు, ప్రస్తుతం మీ బిడ్డ వైఎస్ జగన్ నాలుగున్నరేళ్ల సంక్షేమ పాలనకు మధ్య వ్యత్యాసాన్ని గుర్తించాలన్నారు. చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా ఉన్నా చెప్పుకోవడానికి ఒక్క పథకం లేదన్నారు. టీడీపీ నాయకులు ఊళ్లకు ఊళ్లు పంచుకుతిని ప్రజా ధనాన్ని కొల్లగొట్టారన్నారు. బాబు హయంలో కేవలం 34 వేల ప్రభుత్వ ఉద్యోగాలిస్తే.. జగన్ అధికారంలోకి వచ్చాక 4.93 లక్షల మందికి అవకాశం కల్పించారన్నారు. ఇందులో ప్రభుత్వ ఉద్యోగులు 2,13,662 మంది ఉన్నట్టు స్పష్టం చేశారు. మంచిచేయడం చేతకాని ఈ తెలుగు ద్రోహులకు చెద్దతలపెట్టేలా ఆలోచనలు చేస్తున్నారని దుయ్యబట్టారు. అధికారంలోకి వస్తే వలంటీర్లు తొలగిస్తాం, సచివాలయాలు రద్దు చేస్తాం, పేదలకు ఇన్ని పథకాలు అందిస్తే సోమర్లుగా మారుతారంటూ చంద్రబాబు నిసిగ్గుగా మాట్లాడే స్థితికి దిగజారిపోయాడని ధ్వజమెత్తారు. మీ బిడ్డకు అమ్మఒడి, విద్యాకానుక, విద్యాదీవెన, వసతిదీవెన, విదేశీ విద్య లాంటి పథకాలు రావాలంటే జగన్ ముఖ్యమంత్రిగా ఉండాలనే విషయం గుర్తించుకోవాలన్నారు. మహిళలకు ఆసరా, చేయూత, సున్నావడ్డీ, డ్వాక్రా రుణాలు కావాలంటే జగన్ ఉండాలన్నారు. రజక, నాయిబ్రహ్మణ, కమ్మరి, కుమ్మరికి మేలు జరగాలన్నా జగన్ ఉండి తీరాలన్నారు. మాటల గారడీలు చెప్పే టీడీపీ దొంగలు కావాలా..? మీ అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి పనిచేసే జగన్ కావాలో మరో సారి ఆలోచించుకోవాలన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు, రాయదుర్గం కాలవ శ్రీనివాసులు ఇద్దరూ అవినీతి పరులేనని, 2024 ఎన్నికలే వీరికి ఆఖరివి కాబోతున్నాయన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో జగన్ చేసిన మేలును ఇంటింటా వివరించి మరోసారి సీఎం ను చేసుకుందామన్నారు. అనంతరం చైర్‌పర్సన్, గౌని మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులు, పార్టీ నాయకులతో కలసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ హౌసింగ్ డైరెక్టర్ శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాదవరెడ్డి, కూన నాగప్ప, పొరాళ్ల శివ, కౌన్సిలర్లు గౌని లావణ్య, శారద, పద్మజ, శ్రీనివాసరెడ్డి, పొరాళ్ల గోవిందరాజులు, శ్రీలక్ష్మి, బండి అజయ్, కో–ఆప్షన్ సభ్యులు సత్యనారాయణ, కడ్డిపుడి నజీర్, వేపరాళ్ల దిలవర్ బాష, వార్డు ఇన్‌చార్జులు దివాకర్, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

- రాయదుర్గం మండలంలోని ఆవులదట్ల గ్రామంలో మండల కన్వీనర్ మల్లికార్జున అధ్యక్షతన గురువారం సాయంత్రం జరిగిన ' వై ఏపీ నీడ్స్ జగన్ 'అనే కార్యక్రమానికి విప్ కాపు రామచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకూ మేలు జరుగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన ఈ నాలుగున్నరేళ్లలో ఆవులదట్ల సచివాలయ పరిధిలో డీబీటీ, నాన్ డీబీటీ, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు రూ.15,57,84,125 లు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. అంతకు మునుపు ఆర్బీకే వద్ద ఏర్పాటు చేసిన జెండాకట్ట వద్ద రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్ర రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, జెడ్పీటీసీ హొన్నే మల్లికార్జున, ఎంపీపీ విద్యావతితో కలసి ఆయన పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో రేకులకుంట శివారెడ్డి, బోర్‌వెల్ నాగిరెడ్డి, వైస్ సర్పంచ్ వెంకటేష్ నాయక్, మండల కోఆప్షన్ సభ్యుడు దిలావర్ బాషా, సచివాలయాల మండల కన్వీనర్ మురహరి, నారాయణ నాయక్, ధర్మా నాయక్, రామచంద్ర, తిప్పేస్వామి, జనార్ధన, ప్రహ్లాద, చిక్కణ్ణ, వద్రహొన్నూరు ఎంపీటీసీ అరుణ్ కుమార్, నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, మల్లాపురం చంద్రశేఖర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బాబులు, బొజ్జప్ప, వీరాపురం మహేష్, అంజనేయులు , హనుమంతరాయుడు, మఠం మహేష్, కొల్లప్ప తదితరులు పాల్గొన్నారు. .

వజ్రకరూరు: ప్రజలకు మరింత మేలు జరగాలంటే రాష్ట్రానికి మరోమారు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉండాలని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చాబాల గ్రామ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కార్యక్రమాన్ని ప్రారంభించారు .ముందుగా అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులతో కలసి ఆయన సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిం చారు. అనంతరం సర్పంచు మల్లెల జగదీష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషిని ప్రజలకు వివరించడానికే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. టీడీపీ పాలనలో ఆ పార్టీ కండువాలు కప్పుకున్నవారికి మాత్రమే పథకాలు అందాయన్నారు.జగన్ పాలనలో అర్హతే ప్రమాణికంగా పథకాలు అందుతున్నాయన్నారు. జగన్ పాలనలో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయని, రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన 32 లక్షల మందికి ఇంటి స్థలాలు అందాయన్నారు. అనంతరం ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే బుక్‌లెట్లను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ రమావత్ దేవి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, ఎంపీటీసీ పెన్నహోబిలం, మాజీ వైస్ ఎంపీపీ నారాయణప్ప, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సుశీలమ్మ, సర్పంచు మోనాలిసా, జేసీఎస్ కన్వీనర్ ఉస్మాన్, సచివాలయ కన్వీనర్ రామచంద్ర, నాయకులు మారెన్న, వైద్యనాథ రెడ్డి, మహానందరెడ్డి, మోహన్, చక్రిస్వామి, శ్రీనివాసులు, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ విజయలలిత, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



డి హీరేహాళ్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కణేకల్లు–2 సచివాలయ పరిధిలో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం



బొమ్మనహాళ్ మండలం దర్గాహొన్నూరు–1లో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఉరవకొండ మండలం ఆమిద్యాల సచివాలయం–1 లో బుక్‌లెట్లు ఆవిష్కరిస్తున్న నేతలు



గుమ్మఘట్టలో సంక్షేమ పథకాల క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



ఉరవకొండ మండలం ఆమిద్యాల సచివాలయం–1 పరిధిలో బ్రోచర్లు విడుదల చేస్తున్న దృశ్యం



బెళుగుప్పలో పార్టీ జెండాను ఆవిష్కరించి వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు



కూడేరు మండలం చోళసముద్రంలో బుక్‌లెట్ అందజేస్తున్న ఎంపీపీ నారాయణరెడ్డి, నేతలు



విడపనకల్లు మండలం పాల్తూరులో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు హనుమంతు



కళ్యాణదుర్గం మున్సిపాలిటీ దొడగట్టలో పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు, అధికారులు.



కంబదూరులో మాట్లాడుతున్న సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్



బ్రహ్మసముద్రం మండలం భైరసముద్రం గ్రామంలో బుక్‌లెట్ అందజేస్తున్న ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి



శెట్టూరులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేస్తున్న నాయకులు



కుందుర్పి: మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మీ నరసింహస్వామి

సీఎం జగన్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం

వజ్రకరూరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ ఫలాలు అందాయని ఎంపీ తలారి రంగయ్య, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు.గురువారం మండలంలోని కొనకొండ్ల గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలోని మెయిన్‌రోడ్‌లో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీ, మాజీ ఎమ్మెల్యే గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి నాలుగు సంవత్సరాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చే సిన సంక్షేమ పథకాలు, ప్రజలకు మేలు తదితర వాటిని వివరించి బుక్‌లెట్ అందజేశారు వారు మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. జగన్ పాలనలో విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి రూ.వేల కోట్లు నిధులు ఖర్చుచేశారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, ఎంపీపీ రమావత్‌దేవి, వైస్ ఎంపీపీ సుంకమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సుశీలమ్మ, జేసీఎస్ కన్వీనర్ ఉస్మాన్, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి రంగనాథ్‌యాదవ్, మాజీ సర్పంచు దాసరి గోవిందు, బీసీ సెల్ కార్యదర్శి చైతన్యకుమార్, సచివాలయ కన్వీనర్లు వడ్డె లింగరాజు, వాల్మీకి గోవిందు, స్థానిక నాయకులు వాల్మీకి కిష్టప్ప, రాధాక్రిష్ణ, చాకలి శివ, సర్పంచులు మోనాలిసా, మల్లెల జగదీష్, కురుబ లక్ష్మయ్య, శివాజీనాయక్, సురేంద్ర, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కొనకొండ్లలో బుక్‌లెట్ అందచేస్తున్న ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

తప్పుల్లేని ఓటరు జాబితా తయారీకి సహకరించాలి

ఉరవకొండ: రాబోవు సార్వత్రిక ఎన్నికల్లోపు తప్పులు లేని ఓటరు జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మునీంద్ర సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ అసెంబ్లీ పరిధిలోని రాజకీయ పార్టీ నేతల సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఈనెల 4, 5 తేదీల్లో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో ఫారం–6లు 8,498 స్వీకరించామని, ఇందులో 1,254 తిరస్కరించి, 2,471 స్వీకరించామన్నారు. 5,895 ఫారం–7 దరఖాస్తులు అందగా 440 మాత్రమే స్వీకరించామని మిగితావి విచారణ చేపడుతున్నామన్నారు. ఫారం–8కు సంబంధించి 7,854 దరఖాస్తులు రాగా ఇందులో 151 తిరస్కరణకు గురికాక 3,290 స్వీకరించామన్నారు. కార్యక్రమంలో ఎన్నికల సీనియర్ సహాయకుడు వంశీకృష్ణ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై స్టేలన్నీ ఎత్తేయాలి

బొమ్మనహాళ్: చంద్రబాబునాయుడు చేసిన ఆర్థిక నేరాలు, మోసాలు ఒక్కొక్కటిగా బయటికొస్తున్నాయని , ఇప్పటి వరకూ కోర్టులను అడ్డుపెట్టుకుని పలు కేసుల్లో తెచ్చుకున్న స్టేలను ఎత్తేయిస్తే జీవితకాలం జైలులో ఉండాల్సి వస్తుందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ మండల మాజీ కన్వీనర్ ఈశ్వరరెడ్డి అన్నారు. గురువారం పలు విజ్ఞప్తులతో కూడిన వినతిపత్రం తహసీల్దార్ శ్రీనివాసులకు అందజేశారు. వారు మాట్లాడుతూ గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని చంద్రబాబు ఆర్థిక నేరాలకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. చంద్రబాబుపై నమోదైన కేసులన్నీ సమగ్రంగా విచారణ జరిపిస్తే రూ. లక్షల కోట్లు అవినీతి రుజువవుతుందన్నారు. చంద్రబాబుపై నమోదైన కేసుల విచారణతో పాటు వ్యవస్థలను మేనేజ్ చేస్తూ తెచ్చుకున్న స్టేలన్నీ వెకేట్ చేసేలా సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు యోగేశ్వరరెడ్డి, సత్యన్న, జయరాంరెడ్డి, జి.ఎం నాయుడు, బుజ్జి, వీరన్నగౌడ్, అంజి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

కూడేరు: స్థానిక సచివాలయం–1 పరిధిలో శుక్రవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ కార్యక్రమ సచివాలయ ఇన్‌చార్జ్, అగ్రి అడ్వైజరీ మండల చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బైరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం తెలిపారు. సచివాలయ ఉద్యోగులు , ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు హాజరు కావాలన్నారు.

మద్యం దుకాణాల్లో తనిఖీ

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ పరిధిలోఉన్న నాలుగు మద్యం దుకాణాల్లో గురువారం ఎక్సైజ్ జిల్లా అధికారి మధుబాబు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మద్యం బాటిళ్లను ఎమ్మార్పీ రేటు కంటే ఎక్కువకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సీఐ జగదీష్ రెడ్డి, ఎస్ఐ చాంద్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికులకు బహుమతులు

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం–అనంతపురం మార్గంలో ప్రయాణించే వారికి ప్రవేశపెట్టిన లక్కీ డిప్‌ను గురువారం కళ్యాణదుర్గం డిపోలో డీఎం రామచంద్ర కూపన్లను తీశారు. మొదటి బహుమతి కణేకల్లుకు చెందిన రవీంద్రనాథ్‌రెడ్డి, రెండో బహుమతి నాగిరెడ్డిపల్లికి చెందిన గురుప్రసాద్, మూడో బహుమతి ఓబుగానిపల్లి చెందిన సుబ్బారాయుడు దక్కించుకున్నారు.

ప్రజా రక్షణభేరికి తరలిరండి

కూడేరు: విజయవాడలో ఈ నెల 15న నిర్వహించే ప్రజారక్షణ భేరి కార్యక్రమానికి మండలం నుంచి సీపీఎం నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమూర్తి కోరారు. గురువారం పార్టీ కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు.

సంక్షిప్తం

కర్ణాటక మద్యం పట్టివేత

రాయదుర్గం: రాయదుర్గం సెబ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కర్ణాటక మద్యం విక్రయిస్తూ గురువారం నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారని సెబ్ ఎస్ఐ హరికృష్ణ తెలిపారు. స్థానిక పీఎస్‌లో వారి వివరాలను ఎస్ఐ విలేకరులకు వెల్లడించారు. డి హీరేహాళ్ మండలంలోని గొడిశెలపల్లికి చెందిన రామాంజనేయులు వద్ద 192 టెట్రా ప్యాకెట్లు , నారాయణరెడ్డి వద్ద 20 టెట్రా ప్యాకెట్లు, రాయదుర్గం మండలం కెంచానపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి ద్విచక్రవాహనంతో పాటు 288 టెట్రా ప్యాకెట్లు, కళ్యాణదుర్గం మండలం ముప్పలకుంటకు చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి ద్వి చక్ర వాహనం, 192 ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసులు నమోదుచేశామన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ట్యాబ్‌ల పంపిణీ

బెళుగుప్ప: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రత్యేక అవసరాల విద్యార్థులను గుర్తించి ట్యాబ్‌లను పంపిణీ చేశారు. బెళుగుప్ప ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థి హర్షవర్ధన్‌రెడ్డి, గుండ్లపల్లి ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థిని అంజుమ కు ఎంఈఓలు మల్లారెడ్డి, హరికృష్ణ, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటప్రసాద్ ట్యాబ్‌లను అందజేశారు.

తిమ్మప్ప ఆలయ నిర్మాణానికి భూమి పూజ

కుందుర్పి: స్థానిక ఎస్సీ కాలనీలో తిమ్మప్ప ఆలయ నిర్మాణానికి గురువారం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు భూమి పూజ చేశారు. ఆలయ నిర్మాణానికి మంత్రి ఉషశ్రీచరణ్ చొరవతో టీటీడీ రూ.10 లక్షలు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. దళిత నాయకులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళిత కాలనీల అభివృద్ధికి చర్యలు చేపట్టడం హర్షణీయమన్నారు. పార్టీ మండల కన్వీనర్ సత్యానారాయణశాస్త్రి, జెడ్పీ మాజీ సభ్యుడు రాజగోపాల్, సర్పంచ్ మారుతేశ్వరి, వార్డు సభ్యులు దురగమ్మ, మంజునాథ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తక్షణసాయం అందజేత

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్టలో చంద్రశేఖర్ అనే వ్యక్తి బుధవారం మృతిచెందగా.. గురువారం మృతుడి భార్య సునీతను వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణసాయం రూ.10 వేల వేల నగదు అధికారులు అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, పట్టణ కన్వీనర్ శ్రీనివాసులు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ అర్చన, కౌన్సిలర్ తిరుమల వెంకటేశులు, నాయకులు సుధాకర్ రెడ్డి, బసవరాజు పాల్గొన్నారు.

పిల్లలపల్లిలో..

బ్రహ్మసముద్రం: మండలంలోని పిల్లలపల్లిలో హరిజన వన్నూరప్ప ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ గోవిందప్ప తదితరులు మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయం రూ.10 వేలు అందజేశారు. అలాగే కుర్లగుండకు చెందిన బోయ శ్రీనివాసులు కిడ్నీ సంబంధిత వ్యాధితో మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీ నాయకులు శంకరప్ప, రామక్రిష్ణ వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణసాయం రూ.10 వేలను మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

కొత్తూరులో..

బొమ్మనహాళ్: మండలంలోని కొత్తూరు గ్రామానికి వైఎస్సార్‌సీపీ కార్యకర్త కె.మలెప్ప (45) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీటీసీ తిమ్మప్ప వైఎస్సార్ బీమా పథకం ద్వారా తక్షణసాయం రూ. 10 వేలు నగదును మృతుడి కుటుంబానికి అందజేశారు. మిగిలిన మొత్తం నామినీ బ్యాంకు ఖాతాలోకి జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి

విడపనకల్లు: మండలంలోని పాలికిలో సర్పంచు బోయ నాగమ్మ, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కోదండరామిరెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

కబరస్తాన్ స్థలాన్ని సర్వే చేయండి

కణేకల్లు: శ్మశాన (కబరస్తాన్) వాటిక స్థలం కబ్జాకు గురైందని, సర్వే చేసి న్యాయం చేయాలని తహసీల్దార్ రజాక్‌వలీకి బ్రహ్మసముద్రం గ్రామ ముస్లింలు విన్నవించారు. గ్రామానికి చెందిన ముస్లింలు గురువారం తహసీల్దార్‌ను కలిసి కబరస్తాన్ కబ్జా గురించి ఫిర్యాదు చేశారు. కబరస్తాన్ విస్తీర్ణం 3.36 ఎకరాలుండగా చాలా స్థలం కబ్జా అయ్యిందన్నారు. పంట కాలువ పూడికతీత సమయంలో కాలువను వెడల్పుగా తీసి స్థలాన్ని కబ్జా చేశారన్నారు. దీంతో పాటు చుట్టూ ఉన్న స్థలం కూడా కబ్జా అయ్యిందన్నారు. సమస్యను పరిష్కరించకపోతే కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామన్నారు. సమస్య పెండింగ్ ఉంచకుండా చూడాలని జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి తహశీల్దార్‌కు విన్నవించారు. తహసీల్దార్ స్పందిస్తూ రెండో విడత కింద నెలాఖరులోప కబరస్తాన్ స్థలాన్నిరీ సర్వే చేస్తామన్నారు.

భారీ వర్షంతో దెబ్బతిన్న పంటలు

కూడేరు: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి, గురువారం వేకువజామున భారీ వర్షం కురిసింది. దీంతో ముద్దలాపురం, జల్లిపల్లి, మరుట్ల–1,2,3 కాలనీలు, ఉదిరిపకొండ, కొర్రకోడు తదితర గ్రామాల్లో సాగు చేసిన బ్యాడిగి మిర్చి, వేరుశనగతో పాటు ఇతర పంటలు దెబ్బతిన్నాయి అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.